ఓం శ్రీ సాయిరాం

# సమత

## (సంగీత నృత్య నాటకం)

పాత్రలు :

| | | |
|---|---|---|
| 1. | సత్యం | |
| 2. | ధర్మం | |
| 3. | శాంతి | |
| 4. | ప్రేమ | |
| 5. | అహింస | సంజ్ఞాపూర్వక పాత్రలు |
| 6. | విస్ఫోటం | |
| 7. | ఖడ్గం | |
| 8. | తూటా | |
| 9. | ప్రజలు-3 | - హిందు, ముస్లిం, క్రైస్తవుడు |
| 10. | షిరిడిబాబా | |
| 11. | మహల్సాపతి | - బాబా పూజారి |
| 12. | శ్యామా | - బాబా భక్తుడు |
| 13. | అక్బర్ | - మొఘల్ పాదుషా |
| 14. | మాన్‌సింగ్ | - అక్బర్ మంత్రి |
| 15. | శ్రీరామ్ | - హిందువు అక్బర్ రాజ్యంలో పౌరుడు |
| 16. | రహీమ్ | - ముస్లిమ్ అక్బర్ రాజ్యంలో పౌరుడు |
| 17. | తాన్‌సేన్ | - అక్బర్ ఆస్థాన గాయకుడు |
| 18. | భటులు-4 | - అక్బర్ దర్బార్‌లో భటులు |
| 19. | బాపూ | - మహాత్మాగాంధీ |
| 20. | ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ | - గాంధీ సహచరుడు |
| 21. | జవహర్ | - జవహర్‌లాల్ నెహ్రూ |
| 22. | మదర్ | - మదర్ థెరిస్సా ప్రసిద్ధ క్రైస్తవ యోగిని |
| 23. | సన్యాసినులు - 2 | - మదర్ అనుయాయులు |
| 24. | విలేఖరి | - పత్రికా విలేఖరి |

ఓం శ్రీసాయిరాం

# 'సమత'

రచన : ఎం.ఎస్. ప్రకాశరావు

('సాయిగాయిత్రి' నేపథ్యంలో వినిపిస్తూ ఉంటుంది. ఇంతలో మృదంగ నినాదం విస్ఫోటం, ఖడ్గం, తూటా ముగ్గురూ వర్తులాకారంగా ఒకరి వెనుక ప్రజల్ని తరుముకుంటూ పరిగెత్తుతూ ఉంటారు. ప్రజలు 'హాహా'కారాలు చేస్తూ ఉంటారు. ఇంతలో 'ఓంకారం' వినిపిస్తోంది. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలు తెల్లని స్వచ్ఛమైన దుస్తులతో ప్రవేశిస్తారు.)

విస్ఫోటం : ఎవరు మీరు. మా విధ్వంసానికడ్డొస్తున్నారు.

సత్యం : సత్యాన్ని, యుగయుగాలుగా నన్ను ఆశ్రయించిన మానవుల్ని మహనీయుల్ని చేశాను. ఇంతకీ నువ్వెవరు?

విస్ఫోటం : విస్ఫోటాన్ని, అంటే బాంబుని భూనభోంతరాళాలు దద్దరిల్లేలా పేలగలను. ఒక్క పేలుడుతో వందలాదిమంది ప్రాణాలు తియ్యగలను.

సత్యం : ఒక్కరికి ప్రాణాలు పొయ్యగలవా?

విస్ఫోటం : ఇది నా ధర్మం కాదు

సత్యం : మొక్క నాటి పెంచి, పుష్పించి, ఫలించేలా చేసేవారికే దానిని త్రుంచే అధికారం వుంటుంది. భగవంతుడి సృష్టిని నాశనం చేసే అధికారం నీకెవరిచ్చారు?

విస్ఫోటం : నన్నే ప్రశ్నిస్తున్నావా. విస్ఫోటం అంటే భయంలేదా నీకు?

సత్యం : సత్యానికి భయం వుండదు. నన్నాదరించిన గాంధీజీ, చేతికర్రతో మర ఫిరంగుల సైన్యాన్ని దేశం వదిలిపోయేలా తరిమికొట్టాడు. రాజా హరిశ్చంద్రుడు ఎన్ని కష్టాలపాలైనా నన్ను నమ్ముకుని చివరకు పరమేశ్వర సాక్షాత్కారం పొందాడు. యశశ్చంద్రుడయ్యాడు. సత్యాన్ని ఎదిరించిన వారందరూ అధోగతి పాలయ్యారని గుర్తుంచుకో. (ధర్మం నవ్వుతుంది)

ఖడ్గం : మా అన్నని చూసి నవ్వుతున్నావు, నువ్వెవరు?

ధర్మం : ధర్మాన్ని, నీ ఘనతేమిటి?

ఖడ్గం : నేను ఖడ్గాన్ని. మా అన్నలాగే నరమేధం సృష్టించగలను, పీకలుత్తరించగలను.

ధర్మం : జనం మేధస్సుని మంచివైపు మరల్చగలవా?

ఖడ్గం : నేనెందుకు మరల్చాలి?

ధర్మం : మరి రక్తధారలు చిందించగలవా? నువ్వు ఖడ్గానివి, చేతనైతే దుర్మార్గాన్ని త్రుంచు. సన్మార్గులకి అండగా నిలబడు. నారీమణుల శీలసౌభాగ్యాన్ని కాపాడు. శివాజీ ఖడ్గం చేసిన పని అదే. అంతేగాని సమాజంలో హాహాకారాలు చెలరేపడం, సోదరీమణుల పసుపు కుంకుమలు హరించడమూ కాదు. నీ స్పర్శతో ఒక్క పసిపాప ముఖంలోనైనా చిరునవ్వు చిందింపచేయగలవా?

ఖడ్గం : హద్దు మీరుతున్నావు.

(శాంతి, ప్రేమ, అహింసలు నవ్వుతారు)

ధర్మం : బెదిరిస్తున్నావా? నన్ను నమ్మిన శ్రీరాముడు శివధనుర్భంగం చేశాడు. వారధి నిర్మించాడు. అసురుల్ని నిర్జించాడు. అజరామరమైన కీర్తి సంపాదించుకున్నాడు. అఖిల భారతావనికి ఆరాధ్యదైవమయ్యాడు. నన్ను నువ్వేం చేయగలవు? నువ్వు దుర్మార్గుల చేతిలో ఆయుధానివి. నాకు హాని తలపెడితే, భగవంతుడే స్వయంగా దిగి వస్తాడు, నిన్ను శిక్షిస్తాడు. పురాణాలు చదవలేదా?

(శాంతి, ప్రేమ, అహింసలు నవ్వుతారు)

తూటా : మా అన్నని అలా హేళన చెయ్యకండి. నన్నెదిరించి మాట్లాడకండి. ఇంతకీ సత్య, ధర్మాలకి తమ్ముళ్ళా మీరు.

శాంతి : ఔను. నేను శాంతిని, నీకు సిరి సంపదలున్నా, అధికారం ఉన్నా, అందలాలెక్కినా శాంతి లేదనుకో నిద్రాహారాలు లేక అలమటిస్తావు. సంపాదించుకున్నవేవీ అనుభవించలేవు. ఉన్న శాంతిని భంగం చెయ్యగలవు కానీ, తుపాకీలో తూటావి. శాంతిని సృష్టించగలవా నువ్వు.

తూటా : శాంతిని భంగ పరిచేందుకే నేను పుట్టాను.

శాంతి : నీలాంటి వాళ్లు నన్నేం చెయ్యలేరు. నేను మహనీయుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నాను. వారి బోధనలు విన్నవారి మనసుల్లో నిండిపోతాను. అప్పుడేం చెయ్యగలవు?

తూటా : పొంచి వుండి దెబ్బతీస్తాను. గుండెల్ని చీల్చేస్తాను.

శాంతి : గొప్ప పని చేస్తావు. పగిలిన గుండెను అతికించగలవా? ఆ పని చెయ్యలేవు. ముసుగేసుకుని దొంగలా దెబ్బ తియ్యడమూ ఓ ఘనకార్యమేనా? గుండె ఎదురొడ్డిన ఆంధ్రకేసరి గుండెల్ని చీల్చగలిగావా? అల్లూరి కీర్తిని హరించగలిగావా?

తూటా : అంతమాత్రాన నేను బలహీనుణ్ణా?

శాంతి : బలవంతుడివా, బలహీనుడివా అన్న ప్రశ్న కాదు! నిన్ను ప్రయోగించిన వీరుని ముఖంలో ధర్మవిజయపు ఆనందం తొణికిసలాడాలి...... నీ తుపాకీని అమరవీరుల స్మృతిచిహ్నంగా ప్రజలు గౌరవించాలి. పూలమాలలు తుపాకీని గౌరవించే ఆ దృశ్యం చూడు. దేశభక్తి పొంగి పొరలుతుంది. శరీరం పులకిస్తుంది. కళ్ళలో ఆనందభాష్పాలు కురుస్తాయి. ముసుగువీరుల చేతిలో మారణహోమం సృష్టించే నిన్ను ప్రజలు అసహ్యించుకుంటారు. నీదీ ఓ జీవితమేనా?

ప్రేమ : ఆలోచించుకో ఒక్కసారి.

విస్ఫోటం : మాకు సలహా ఇస్తున్నారు మీరెవరు?

ప్రేమ : చూశావా నువ్వెంచుకున్న మార్గం నన్ను కూడా గుర్తించలేని స్థితికి నిన్ను దిగజార్చింది

విస్ఫోటం : మీరంత గొప్పవారా?

ప్రేమ : మీ అమ్మ నీకు పాలిచ్చి పెంచిందంటే కారణం నేను. నీ తండ్రి నిన్ను గుండెలకు హత్తుకున్నాడంటే కారణం నేను. నీ గురువు విద్యాబుద్ధులు అభిమానంగా చెప్పాడంటే కారణం నేను. అంతెందుకు ఈ ప్రపంచంలో అందరూ ఆత్మీయానురాగాలు పంచుకుంటున్నారంటే కారణం నేనే.

విస్ఫోటం : 'నేను'కి పేరు లేదా?

ప్రేమ : పేరు లేకేం. విశ్వమంతా అణువణువు నిండిన "ప్రేమ"ని.

ఖడ్గం : నువ్వంత శక్తిమంతుడివా

ప్రేమ : ఇంకా సందేహిస్తున్నావా. నన్ను నీ గుండెల్లో పెట్టుకో. అందరూ నీవారవుతారు. ఈ లోకమే నీదవుతుంది.

ఖడ్గం : నిజమా!

ప్రేమ : అక్షరాలా నిజం. అందరికీ ప్రేమ పంచిన కృష్ణుడు దైవంగా పూజింపబడ్డాడు. దేశాన్ని ప్రేమించిన గాంధీ మహాత్ముడయ్యాడు. దైవాన్ని ప్రేమించిన భక్తులు

మహనీయులుగా గుర్తింపబడ్డారు. పూర్వపు కథలెందుకు, ఈనాడే చూడు. అమృతంలాంటి ప్రేమ పంచిన భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారిని విశ్వమంతా భగవంతుడని కీర్తించడంలేదా? ఒక్కమారు ఆలోచించు. అమాయకుల అశువులు తీసిన నిన్ను ద్వేషిస్తారు తప్ప గౌరవిస్తారా? ఏమైనా నీ మారణ హెూమానికేం ప్రయోజనం వుంది. దు:ఖం తప్ప.

ఖడ్గం : మా ఆశయం సిద్ధిస్తుంది.

ప్రేమ : దు:ఖం నీ ఆశయమా?కల్లోలం నీ ప్రయోజనమా? మారణహెూమం నీ లక్ష్యమా? ఏమిటి నీ ఆశయం? పెడదారి పట్టిన స్వార్ధపరుల చేతిలో కీలుబొమ్మవి. కసాయివాడి కత్తికీ నీకూ బేధం లేదు.

తూటా : నువ్వేం సాధించగలవు.

అహింస : నీకు చరిత్ర తెలియనట్టుంది. నేను దారి దొంగ బోయవాణ్ణి మహర్షి వాల్మీకిగా మార్చాను. గజదొంగ అంగుళిమాలుణ్ణి బౌద్ధసన్యాసిగా మార్చాను. నన్ను ఆచరణలో పెట్టిన సిద్దార్ధుణ్ణి త్యాగమూర్తి బుద్ధుడిగా తీర్చిదిద్ది లోకారాధ్యుడిగా చేశాను.

తూటా : ఈ చరిత్ర వల్ల నాకేం ప్రయోజనం.

అహింస : చరిత్ర చెప్పిన గుణపాఠాలు నేర్చుకోవాలి. నువ్వంటే అందరికీ భయం, భీతి పోవాలంటే నిన్ను నిందించేవాళ్ళంతా, నిన్ను గౌరవించాలంటే, నన్ను అనుసరించు. నాకందరూ ఆత్మీయులే, అందరూ మిత్రులే.

విస్ఫోటం : మిమ్మల్ని ఆదరిస్తే మాకు ముక్తి లభిస్తుందా?

ఘడ్గం : మిమ్మల్ని అనుసరిస్తే మాకు భక్తి కలుగుతుందా?

తూటా : మిమ్మల్ని ఆత్మీయులుగా భావిస్తే శాంతి సౌభాగ్యాలకి కారణం అవుతామా మేము?

ప్రేమ: : తప్పకుండా కులాల, మతాల ప్రయోజనం కోసం దుర్మార్గాన్ని ఎంచుకున్నారే చల్లదనం యిచ్చే వెన్నెలది ఏ కులం, మనకి ప్రాణం ఇచ్చే గాలిది ఏ మతం. అలాంటిదే మానవత్వం, అన్నిటికీ ఎత్తైన సత్యము కులమతాలను మహనీయులు ఎలా ఆదరించారో, ఆనందం పొందారో చరిత్రను చూసి తెలుసుకోండి.

(నేపథ్య సంగీతం పిల్లలు నృత్యం చేస్తూ ఉండగా షిరిడీబాబా మహల్సాపతి, శ్యామాతో ప్రవేశిస్తారు)

పల్లవి: బాబా రావా దయగనవా

భారం నీదే మొరవినవా

దీనులకావా దిక్కువుకావా

నీ పదసేవ మాకిడలేవా

చూపవా త్రోవా ॥బాబా రావా॥

చ.1 కామితమీవ కరుణ చూపవా

కన్నుల నీ రూపు కానగనీవ

జీవితనావ దరికి చేర్చవా

ఈ భవబంధాలు తెంచగలేవా

సద్గతి నీవేగా సద్గురు దేవా

సన్నుతి ఆలించి సన్మతి నీవా

పాపాల మాపేటి మహానుభావా ॥బాబా రావా॥

చ.2 చిన్మయ రూపమ్ము కొలువగనీవా

చిత్తములోన కొలువుతీరవా

నీ గుణగానం చేయనీయవా

చిత్రము నీ లీల తెలియగనీవా

షిరిడీసాయీశ దరిశనమీవా

చీకటి ఎదలోన వెలుగువుకావా

సంసార తీరాలు తరించనీవా ॥బాబా రావా॥

సాయి శరణం బాబా శరణం

బాబా షిరిడీ సాయిబాబా మొరవినవా

(నేపథ్య సంగీతం అక్బర్ పాదుషా దర్బార్ దృశ్యం)

భటుడు : బారత్ కే సర్‌తాజ్, మహాయోద్ధా, దిలేలాహి, షహేన్‌షా, మహమ్మద్ జలాలుద్దీన్ అక్బర్ పథార్ రహే హై.

(తాన్‌సేన్, మాన్‌సింగ్‌లు దృశ్యంలో వుండగా అక్బర్ పాదుషా ప్రవేశం)

అక్బర్ : తాన్‌సేన్ రామ నామ సంకీర్తన చేయండి

తాన్‌సేన్ : (తాన్‌సేన్ పాడుతూ ఉండగా నర్తకీమణులు నాట్యం చేస్తూ ఉంటారు)

పల్లవి: జయ జయ రామ సమరవిజయ రామా
భయహర నిజభక్త పారీణ రామ ॥జయ॥

చ.1: జలధి బంధించిన సౌమిత్రి రామా
చలవిల్లు విరిచిన సీతారామా
అల సుగ్రీవునేలిన అయోధ్యరామ
చెలగి యజ్ఞము కాచిన కౌసల్యరామ ॥జయ॥

చ.2: పరిరావణాంతక ఆదిత్య కులరామ
గురుమౌనులను గాచే కోదండరామ
ధరనహల్య పాలిటి దశరథరామ
హరురాలి నుతుల లోకాభిరామ ॥జయ॥

చ.3: అతిప్రతాపముల మాయా మృగాంతక రామ
సుతకుశలవప్రియ సుగుణరామ
వితత మహిమల శ్రీ వెంకటాద్రి రామ
మదిలోన బాయని మనువంశ రామ ॥జయ॥

అక్బర్ : మీ రామనామ సంకీర్తన మృదుమధురంగా వుంది, తాన్‌సేన్.

తాన్‌సేన్ : (వినయపూర్వకంగా నమస్కరిస్తాడు)

మాన్‌సింగ్ : ప్రభువులకు మాన్‌సింగ్ వందనాలు.

అక్బర్ : రండి మాన్‌సింగ్.

మాన్‌సింగ్ : ఇది విచిత్రమైన వివాదం ప్రభూ! ప్రభువుల న్యాయపరిష్కార పరిజ్ఞానానికి మచ్చుతునక కాగలదు.

అక్బర్ : అంత సున్నితమైన వివాదమా?

మాన్‌సింగ్ : జీ హుజూర్. మనవి చెయ్యమంటారా?

అక్బర్ : అనుమతినిస్తున్నాను.

మాన్‌సింగ్ : రహీమ్, ప్రభువులకు మీ వివాదాన్ని వినిపించండి.

రహీమ్ : సలామలేకుమ్ జహాపనా! హుజూర్ నా పేరు రహీమ్. ఈ శ్రీరామ్ నా ప్రాణమిత్రుడు మేము ఒకరిని విడిచి ఒకరు వుండలేము. మా కుటుంబాలు కూడా చాలా సన్నిహితంగా వుంటాయి.

అక్బర్ : ఊ

రహీమ్ : ఇటీవల నేను వ్యాపారంలో చాలా నష్టపోయి, అప్పులపాలయి పోయాను. విషయం తెలుసుకున్న శ్రీరామ్ తన భార్య నగలన్నీ అమ్మి నా అప్పులు తీర్చాడు. నన్ను ఋణవిముక్తుణ్ణి చేసాడు.

అక్బర్ : ఊ

రహీమ్ : అప్పు తీరడంతో, శ్రద్ధగా వ్యాపారం చేసాను. వ్యాపారంలో బాగా లాభాలు వచ్చాయి. బాధ్యతనెరిగిన వ్యక్తిగా శ్రీరామ్‌కి అతనిచ్చిన సొమ్ము వాపసు చేద్దామని ధనం తెచ్చాను.

అక్బర్ : ఊ

రహీమ్ : కాని ధనం నేను అప్పుగా ఇవ్వలేదు అని చెప్పి శ్రీరామ్ స్వీకరించటంలేదు హుజూర్. అప్పు తీర్చకపోతే అల్లా క్షమించడు. అందుకే ధనం స్వీకరించమంటున్నాను హుజూర్.

మాన్‌సింగ్ : మీ వాదన వినిపించండి శ్రీరామ్.

శ్రీరామ్ : ప్రభూ! మా రహీమ్ చెప్పింది అక్షరాల నిజం. ఆ ధనం నేను అప్పుగా యివ్వలేదు. స్నేహధర్మంగా యిచ్చాను. ఆపదలో వున్న మిత్రుణ్ణి ఆదుకోవడానికి ఏ త్యాగానికైనా సిద్ధపడే అపురూపమైన స్నేహం మాది. ఆ ధనాన్ని స్వీకరిస్తే స్నేహానికి ప్రతిఫలం ఆశించినట్టే కదా ప్రభూ. ధనం స్వీకరించి స్నేహధర్మాన్ని అవమానిస్తే రాముడు క్షమిస్తాడా ప్రభూ?

మాన్‌సింగ్ : ప్రభూ! ఇదీ వివాదం. ప్రభువులు న్యాయనిర్ణయ చేయ ప్రార్థన.

అక్బర్ : (ఒక్క క్షణం ఆలోచించి) మాన్‌సింగ్, మా న్యాయనిర్ణయ ప్రతిభకు చక్కని పరీక్ష పెట్టారు. శ్రీరామ్! రహీమ్! మతబేధాలు మర్చిపోయి అమోఘమైన స్నేహధర్మాన్ని మీరు ప్రదర్శించారు. మిమ్మల్ని అభినందిస్తూ ఇద్దరికీ పదివేల వరహాలు బహుమానంగా ప్రకటిస్తున్నాం.....శ్రీరామ్ మీకు ఎంతమంది సంతానం?

రహీమ్ : జహాపనా! మా శ్రీరామ్‌కు ఒక్కతే కుమార్తె. ఆమెకు వివాహం కూడా నిశ్చయమైంది.

అక్బర్ : రహీమ్! ఆ వివాహానికి స్నేహధర్మంగా మీ బిడ్డగా భావించి సువర్ణాభరణాలు కానుకగా

ఇవ్వండి. శ్రీరామ్ ఇది స్నేహధర్మంగా మీరు అంగీకరించక తప్పదు.

శ్రీరామ్ : ఆజ్ఞ హుజూర్.

అక్బర్ : మాన్‌సింగ్. ఈ మిత్రుల్ని సత్కరించి మతాతీతమైన వీరి మైత్రిని దేశ ప్రజలందరికీ చాటించండి. వీరిలా ఆదర్శంగా వుండాలని దేశమంతా ప్రచారం చేయండి.

మాన్‌సింగ్ : తమ న్యాయనిర్ణయం అద్వితీయం జహాపనా. తమ ఆజ్ఞ వెంటనే అమలుచేస్తాం.

(పిల్లలు నృత్యం చేస్తూ ఉండగా గాంధీ, జవహర్, ఖాన్‌ల ప్రవేశం)

పల్లవి : భారతమాతకు జై అనరా
భాగ్యవిధాతకు జై అనరా
దశదిశాంతములు ప్రతిధ్వనించగ
ధన్యచరిత మన ప్రియతమ మాతకు
వందేమాతరం వందేమాతరం వందేమాతరం ॥భారతమాత॥

చ. 1 : బౌద్ధులు జైనులు పారశీకులు హిందూ ముస్లింలందరిని
లెక్కకు మించిన మతాలెన్నిటినో
అక్కున చేర్చుకు లాలించిన మన ॥భారతమాత॥

చ. 2 : కలసి మెలసి జీవించుటలో కలుగును సుఖసంపదలంటూ
కులమత భేదాలేవి చూపకా
లాలనతో ప్రేమించిన మన ॥భారతమాత॥

చ. 3 : ఆచారాలు సంప్రదాయములు భాషా జాతి వేరైనా
భారతీయులు ఒక్కటేనని
భావిపదమ్మును చూపినా మన ॥భారతమాత॥

బాపూ : ఖాన్‌భాయీ భారతీయులంతా మతభేదాలు పాటించకుండా సోదరుల్లా ఎలా మెలుగుతున్నారో చూశారా! నాకు పట్టలేనంత ఆనందంగా వుంది.

ఖాన్ : అవును బాపూ! ఇది మీ కృషికీ, పట్టుదలకూ నిదర్శనం.

బాపూ : అంతా భగవంతుడి దయ ఖాన్‌భాయీ.

నెహ్రూ : బాపూ, బాపూ ఒక దుర్వార్త.

బాపూ : ఏమిటి జవహర్

నెహ్రూ : నవాఖాలీలో హిందూ ముస్లింలు కలహించుకుంటున్నారు.

బాపూ : "హేరామ్" రామా! నన్ను పరీక్షిస్తున్నావా! హిందూ ముస్లింలు ఇద్దరూ రెండు కళ్ళు నాకు. ఎవరు బాధపడినా నేను సహించలేను. ఖాన్‌భాయీ, జవహర్ మీరు తక్షణం వెళ్ళండి. హిందూ ముస్లింలు అన్నదమ్ముల్లా మసలాలి. ఆ విధంగా లేకపోతే నేను జీవించి ప్రయోజనం లేదు. ఆమరణ నిరాహారదీక్ష పాటిస్తూ ప్రాణత్యాగం చేస్తానని చెప్పండి.

(రఘుపతి రాఘవ రాజారామ్...పాట వినిపిస్తూ ఉంటుంది)

ఖాన్ : బాపూ! మీ మాటను వారికి తెలియజేశాం. వారందరూ తమ తప్పుని క్షమించమని కోరారు బాపూ. అల్లర్లు సద్దుమణిగాయి.

జవహర్ : బాపూ! మీ ఆశయాలతో, ఆశీస్సులతో హిందూ ముస్లింల ఐక్యత చిరకాలం వర్ధిల్లుతుంది.

బాపూ : జవహర్, ఇది భగవంతుడి కరుణ. తన ఆశీస్సులందించి హిందూ ముస్లింలే కాదు అన్ని మతాలవారూ విశ్వవ్యాప్తంగా కులమతభేదాలు మరచి ఒకే కుటుంబంలా మసలేలా చేసేందుకు సత్యస్వరూపుడైన ఆ భగవంతుడు అవతరించే ఉంటాడు. వారిని మనసారా ప్రార్థిస్తున్నాను. ఈ అవతరణ ఈ పవిత్ర భారతదేశంలోనే జరిగి ఉంటుందని నా విశ్వాసం.

(పిల్లలు నృత్యం చేస్తూ ఉండగా మదర్ ఇద్దరు సన్యాసినులు, ఒక విలేఖరితో ప్రవేశం)

పల్లవి: ఓ దివినేలే ప్రభుని చూడా
నా ఆత్మపయనము సాగింది
నా ఏసు నాకై మార్గము చూపెను
ఆ స్వామి నాతో ధ్యానము చేసెను ॥ఓ॥

చ. 1: శ్రీ ఏసునాధుని సేవా ప్రవంతిలో
ఆ జీవనావలో సాగించు యాత్రలో
ఆ నిర్మల కెరటాలలో ఆ ప్రశాంత జలదారిలో
ఆ క్రీస్తు కనుఛాయలో
నా ప్రాణమే పావనాత్మను చూసింది ॥ఓ దివినేలే॥

విలేఖరి : మదర్ మీరు ఎంతోమంది అనాధల్ని ఆదరించి ఆశ్రయం కల్పిస్తున్నారు దా!

మదర్ : అనాధలకి ఆశ్రయం కల్పిస్తున్నది నేను కాదు భగవంతుడు.

విలేఖరి : అయినా చేసింది మీరే కదా!

మదర్ : నేను నిమిత్తమాత్రురాలిని ఏ దేశంలో పుట్టానో ఈ పవిత్ర భారతావనిలో అడుగు పెట్టాను. డార్జిలింగ్‌లో ఉన్నప్పుడు నిత్యం పరమ పవిత్రమైన హిమాలయాలను చూసేదాన్ని. ఆ కమనీయ దృశ్యం చూసినపుడు మోతీఝిల్‌లోని పేద పిల్లలకు చదువు చెప్పాలనే ఆలోచన కలిగింది. అక్కడితో తృప్తి చెందక కలకత్తాలో అడుగు పెట్టాను. ప్రభూ! నాకేదైనా సేవ చేసే భాగ్యం కల్పిచమని మనసారా ప్రార్థించాను. వ్యాధితో బాధపడుతూ కొన ఊపిరితో వున్న ఒక స్త్రీమూర్తిని ప్రభువు నా చేతిలో పెట్టాడు. మహాప్రసాదమని స్వీకరించాను. ఆనాటి నుండి దీనజనులసేవ నా జీవన విధానమైంది. ఆ సేవతో ప్రతి అనాధుని ముఖంలోనూ ప్రభువు చిరునవ్వుతో నాకు దర్శనం ఇచ్చారు.

విలేఖరి : అపాధలను ఈతరాంచానప్పుడు వారి మతం గురించి ఆలోచించేవారా?

మదర్ : మమత పంచటమే తప్ప మతం గురించి నేను ఆలోచించలేదు. అనాధల్ని అమ్మగా ఆదరించడమే నా మతం.

విలేఖరి : నోబుల్ శాంతి పురస్కారం అందుకుంటున్నప్పుడు మీకేం అనిపించింది?

మదర్ : భగవంతుడు నాకో అనాధబిడ్డని నా చేతికి అందించినట్టు అనిపించింది.

విలేఖరి : మీరు కాకపోతే ఈ అనాధ బిడ్డల్ని ఎవరు ఆదుకునేవారు?

మదర్ : నేను కాకపోతే ఆ సేవకి ప్రభువు మరొకరిని ఎంచుకుంటారు. ఆ భాగ్యం నాకిచ్చినందుకు ప్రభువుకి నేను కృతజ్ఞతలు చెప్పుకోవాలి.

విలేఖరి : ఈ సందర్భంగా మీరిచ్చే సందేశం ఏమిటి?

మదర్ : సందేశాన్ని యిచ్చేంత పెద్దదాన్ని కాదమ్మా. ప్రభువే చెప్పారు, నన్ను పంపిన నా తండ్రి దీనులను ఆదుకునేందుకు తానే వస్తాడని, ఆ వచ్చినప్పుడు సత్యం అనే నామంతో, బట్టతలతో, చెదరని చిరునవ్వుతో, రక్తవర్ణ పీతాంబరంతో దిగి వస్తాడని. వారి దర్శనం కోసం లక్షల సంఖ్యలో ప్రజలు తరలి వస్తారని, వారందరిలోనూ ఆ దేవుడు సేవాభావాన్ని అంకురింపచేస్తాడని, దీనజనులకు అది 'స్వర్ణయుగం' అవుతుందని కూడా చెప్పాడు. ఆ ప్రభువు అవతరించే వుంటాడు.

(నేపథ్య సంగీతం)

సత్యం : చూశారా ఎంతమంది మహనీయులు కులమతభేదాల్ని మరచి ప్రేమను పంచి ఆదర్శమూర్తులుగా కీర్తిప్రతిష్ఠలు సంపాదించుకున్నారో. వారి జీవితాలు ప్రపంచానికి వెలుగుబాటగా మారాయి. ప్రజల మనస్సుల్లో ఉజ్వలతారల్లా వారు నేటికీ ప్రకాశిస్తున్నారు. ప్రజలంతా వారికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నారు.

విస్ఫోటం : తరతరాలనుండి అన్ని మతాలవారిని మనదేశం కన్నతల్లిలా ఆదరించిందన్నమాట.

ఖడ్గం : మాతృప్రేమను అందించిందన్నమాట.

తూటా : ఆత్మబంధువుల్లా ప్రేమించిందన్నమాట.

సత్యం : అది ఆనాడు. మరి ఈనాడు కులమత దేశ వర్గ భావాలకతీతమైన ఒక స్వర్గాన్ని చూపిస్తాను రండి అక్కడ అందరూ పేద గొప్ప లేడాలను, కులమత భేదాలను వర్గవైషమ్యాలను మరచిపోయి అన్ని దైవనామాలను ముక్తకంఠంతో ఆనంద పారవశ్యంతో గానం చేస్తారు. అది భూతల వైకుంఠం. అదే శ్రీసత్యసాయి ప్రభువు దర్శనమిచ్చే ప్రశాంతి నిలయం. ఇక్కడ వున్నది ఒకే మతం. అది ప్రేమ మతం. మా అందరిదీ ఒకే కులం. మానవకులం, మాటలకందని మా భాష హృదయభాష, అందరం ఆరాధించే దైవం ఒక్కరే అతడు సర్వాంతర్యామి. హిందువును మంచి హిందువుగా, మహమ్మదీయుణ్ణి మంచి మహమ్మదీయుడుగా, క్రైస్తవుణ్ణి మంచి క్రైస్తవునిగా తీర్చిదిద్దే ప్రేమమూర్తి భగవాన్ శ్రీసత్యసాయినాధుని దివ్యధామం. విస్ఫోటాలకీ, ఖడ్గాలకీ, తూటాలకీ వెరగుపడని దివ్యాస్త్రం వారి అమృతప్రేమ. ఆ ప్రేమకి లొంగనివారూ, కట్టుబడనివారూ ఇలలో కనిపించరు. సన్మార్గమును వీడి చరియించువారల పట్టి కాపాడుటయే వ్రతము నాకు అన్న ఆ స్వామి పాదాలను ఆశ్రయించండి. విస్ఫోటాల్ని, ఖడ్గాల్ని, తూటాల్ని వదలిపెట్టండి. ఈ భూమండలం మానవత్వం తొణికిసలాడే సుందరనందన వనమౌతుంది. శాంతి సౌభాగ్యాలు వెల్లివిరుస్తాయి. జై సాయిరాం.

(పిల్లలు నృత్యం చేస్తూ ప్రవేశిస్తారు)

పల్లవి: ఇదిగో ఇదిగో ప్రశాంతి నిలయం
శివశక్తీశ్వర ఆలయము
ధర్మనిరతితో సేవారతితో
వెలిగే కలియుగ కైలాసము
నారాయణుడే నరుడై వెలసి
నడయాడే నవ వైకుంఠము ॥ఇదిగో॥

చ. 1 వేదశాస్త్ర విజ్ఞానవీచిక
భరతదేశ ఔన్నత్యదీపిక
దివ్యప్రేమ చైతన్యవాటిక
విశ్వనభస్సున కీర్తితారక ॥ఇదిగో॥

చ. 2 సర్వమతముల స్నేహవారధి
మేటివిద్యలకు వాణిసన్నిధి
నవ్యభవ్య ఆరోగ్యపెన్నిధి
సత్యసాయి చరణాబ్జ సన్నిధి ॥ఇదిగో॥

❄ ❄ ❄